సాక్షి
అనకాపల్లి
గురువారం । 12 । డిసెంబర్ । 2024

ఉత్తమ సేవలకు సముచిత గౌరవం





కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ శతత్ వికాస్ పురస్కారాలను అందించాయి. ఏపీ నుంచి అవార్డులు అందుకుంటున్న నక్కపల్లి మండలం న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలబాబు (సమృద్ధిగా నీటి సరఫరా విభాగం), అనకాపల్లి మండలం తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు (పచ్చదనం-పరిశుభ్రత విభాగం) –నక్కపల్లి/అనకాపల్లి

రైతు నేస్తం

విశిష్ట సేవల ఆర్ఏఆర్ఎస్

21 రకాల చెరకు, 15 రకాల వరి వంగడాల అభివృద్ధి

విభిన్నమైన విశిష్ట సేవలు అందిస్తూ అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) రైతుల పాలిట కల్పవృక్షంగా నిలుస్తోంది. ఇక్కడి శాస్త్రవేత్తల పరిశోధనలకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. అందుకే ఆర్ఏఆర్ఎస్‌ను జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వరించాయి. రైతుకు మేలు కలిగించే నూతన వంగడాల అభివృద్ధి, సేంద్రియ **పంట**లకు సరికొత్త విధానాలు, చెరకు నుంచి **బెల్లం** తయారీ, విదేశాల్లో ఆదరణ పెరిగేలా **బెల్లం** ఉత్పత్తుల తయారీ.. ఇలా చెప్పుకుంటూ **పోతే** పరిశోధన స్థానం ఘనతలు అన్నీ ఇన్నీ **కావు.** ఆర్ఏఆర్ఎస్‌ను అనకాపల్లిలో 1913లో స్థాపించారు. ఈనెల 13న 111వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడా నికి ఈ సంస్థ సిద్ధమవుతోంది.

నవీన బెల్లం ప్లాంట్, రూ.1.37 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్

తాజాగా చిరుధాన్యాలపై వినూత్న పరిశోధనలు

గత ఐదేళ్లుగా 761 కిలోల ఘన, 30,740 లీటర్ల ద్రవ రూప జీవన్ ఎరువులసరఫరా

రేపు ఆర్ఏఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

సాక్షి, అనకాపల్లి: ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలతో ఉత్తరాంధ్రలో వివిధ రకాల పంటల సాగును పరిపుష్టం చేశారు. 21 రకాల చెరకు, 15 రకాలకు పైగా నూతన వరి వంగడాలు అభివృద్ధి చేశారు. గత ఏడాదిలో సుమారు 155 టన్నుల వరకు మేలైన చెరకు వంగడాలను సృష్టించి స్థానిక రైతులకు, పంచదార కర్మాగారాలకు అందించారు. ఒడిశా, తమిళనాడులాంటి పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేశారు. వీటిలో ప్రధానమైనవి మధు, విశ్వామిత్ర, శారద, విశాఖ, కనకమహాలక్ష్మి, ఉత్తర, రేవతి, సింహాద్రి ,శ్రీముఖి, వశిష్ట, నవీన్ వంటి వంగడాలు. ఇటీవలే చెరకులో మంచి రసనాణ్యత కలిగి ఎర్ర కుళ్లు, కాటుక తెగులు రాకుండా ఉండేలా.. మన ప్రాంతాలకు అనువుగా ఉండి, హెక్టారుకు 130 టన్నుల దిగుబడినిచ్చే 'అరుంధతి (2012 ఏ 319)' అనే కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2006 ఏ223, 2010 ఏ 229 వంటి రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇవే కాకుండా , వరి పంటలో 406 క్వింటాళ్ల ఫౌండేషన్ వరి విత్తనం 1,350 ఎకరాలకు సరిపడా సరఫరా చేయడం జరిగింది.

జీవన ఎరువుల తయారీ

రైతుకు తక్కువ ఖర్చుతోపాటు అధిక దిగుబడిని కల్పించే విధంగా జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పొడి, ద్రవ రూప జీవన ఎరువులు తయారీ కేంద్రాలను స్థాపించి గత ఐదేళ్లగా సుమారు 40,650 కిలోల పొడి జీవన ఎరువులు, 27,500 లీటర్ల ద్రవ రూప జీవన ఎరువులను తయారుచేసి రాష్ట్ర వ్యాప్తంగా 75 వేల ఎకరాలకు అందించారు.

నవీన బెల్లం ప్లాంట్ ఏర్పాటు

బెల్లం తయారీలో హైడ్రోస్‌ను వాడకుండా సేంద్రియ పద్ధతిలో తయారు చేసి.. బెల్లం నాణ్యతను పెంచడంపై పరిశోధన చెప్పుకోదగ్గది. బెల్లాన్ని నాణ్యమైన పరిస్థితులలో తయారు చేసే నవీన బెల్లం ప్లాంటును అనకాపల్లి పరిశోధన స్థానంలో 2021లో ఆవిష్కరించారు. ఈ పద్ధతిలో రోజుకు టన్ను బెల్లాన్ని లేదా 1500 లీటర్ల బెల్లం పాకాన్ని లేదా 800 కిలోల బెల్లం పొడిని తయారు చేయవచ్చు.

నాలుగు దేశీయ పేటెంట్లు..

దేశంలో అత్యుత్తమ 4 పేటెంట్లను ఆర్ఏఆర్ఎస్ సాధించింది. ఉప్పుడు బియ్యం ప్రాసెసింగ్, బెల్లంపొడి, బెల్లంపొడి తయారీ, బెల్లం పూతరేకులు యంత్రం తయారీలో పేటెంట్ పొందారు. ఇది వ్యవసాయ విశ్వవిద్యాలయానికే కాకుండా రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. విద్యుత్ సహాయంతో పనిచేసే పూత రేకుల తయారీ యంత్రాన్ని రూపొందించారు. దీనికి 'డిజైన్ పేటెంట్' 2022లోనే లభించింది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసే 'ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్'ను నెలకొల్పారు. మినీ రైస్ మిల్, మినీ పిండిమర, మినీ పప్పు మిల్లు, రాగి పొట్టు తీయు యంత్రం, మినీ ఆయిల్ మిల్లు, కోటింగ్ యంత్రాలు ఆవిష్కరించి వాటిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం ద్వారా రూ.1.37 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపించారు. చెరకు, చిరు ధాన్యాలు, పనస ప్రాసెసింగ్ లైన్లు వంటివి ఎగుమతి చేస్తున్నారు.



ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం

పూతరేకుల తయారీ యంత్రం..

ఆత్రేయపురంలో ప్రయోగాత్మకంగా ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు రూపొందించిన పూతరేకుల తయారీ మెషీన్‌కు అనుమతులు వచ్చాయి. సాధారణంగా పూతరేకులు రోజుకు 650 వరకు చేయగల్గితే ఆర్ఏఆర్ఎస్ సాంకేతికతలో 1200 వరకూ చేయవచ్చు. దీనిని 2016లో రూపొందించారు. ఈ యంత్రం ఖరీదు రూ.35 వేల వరకు ఉంటుంది. తాజాగా చిరుధాన్యాలపై వినూత్న పరిశోధనలు చేస్తున్నారు. జనసామాన్యానికి మిల్లెట్స్ దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు.



యంత్రంపై తయారవుతున్న రేకులు

అవార్డుల పంట

ఆర్ఏఆర్ఎస్‌కు జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయి. సాంకేతిక విభాగంలో 2020–21, 2023–24 సంవత్సరాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రంగా అవార్డు వచ్చింది. అఖిల భారత్ జీవ నియంత్రణ విభాగంలో 2019–20లో 'ఏ' గ్రేడ్ సెంటర్‌గా గుర్తింపు **తెచ్చుకు**ంది. పలువురు శాస్త్రవేత్తలు తమ పరి**శోధనల**కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో **అవార్డు**లు అందుకున్నారు. వ్యవసాయ అధి**కారులకు**, 6000 మంది రైతులకు సుమారు 18 **వాట్సాప్** గ్రూపుల ద్వారా వాతావరణ **సమాచా**రాన్ని అందిస్తున్నారు.

రేపు కిసాన్ మేళా



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: ఆర్ఏఆర్ఎస్‌లో ఈనెల 13న కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ ముకుందరావు చెప్పారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిసాన్ మేళాలో ఉత్తర కోస్తా జిల్లాలైన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. వరి, చెరకు, చిరుధాన్యాల రైతులకు ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ అందించి, వరి, చెరకు, చిరుధాన్యా ల పంటలో వాతావరణానికి అనుగుణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, ఆదిలక్ష్మి, దాడి ఉమామహేశ్వరరావు, కె.వి.రమణమూర్తి, సరిత పాల్గొన్నారు.

నీటి తీరువా కట్టించుకోను.. ఏం చేస్కుంటారో చేస్కోండి

- మీరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు.. పోటీ చేయకండి..
- పాకలపాడు రైతులపై తహసీల్దార్ శ్రీనివాసరావు మండిపాటు



తహసీల్దార్ కార్యాలయం బయట విలేకర్లతో మాట్లాడుతున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు



తహసీల్దార్ శ్రీనివాసరావును పన్ను కట్టించుకోవాలని కోరుతున్న పాకలపాడు రైతులు

గొలుగొండ: పాకలపాడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతుల నుంచి నీటి తీరువా కట్టించుకోను.. మీరు నీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ వాళ్లపై పోటీ చేయకండి.. నేను పన్ను కట్టించుకోను.. ఏం చేస్కుంటారో చేస్కోండి.. అంటూ గొలుగొండ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పాకలపాడు రైతులపై బుధవారం సాయంత్రం మండిపడ్డారు. పన్ను చెల్లించేందుకు వచ్చిన తమపై తహసీల్దార్ మాటలతో రైతులు కంగుతిన్నారు. వివరాల్లోకి వెళితే.. పాకలపాడు గ్రామంలో త్వరలో నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ముందుగా నీటి తీరువా చెల్లించి ఉండాలి. దీని కోసం రెండు రోజుల నుంచి రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నారు. వీరంతా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు. దీంతో ఎలాగైనా ఇక్కడ పోటీ లేకుండా టీడీపీ సానుభూతిపరులను గెలిపించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ రైతు ల నుంచి పన్ను కట్టించుకోలేదు. పాకలపాడు నీటి సంఘం ఎన్నికల్లో టీడీపీకి పట్టులేదు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ అన్ని సెగ్మెంట్లు గెలుస్తుంది. ముంగర్లపాలెం, పాకలపాడు ఆయకట్టు రైతుల్లో 70 శాతం మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే. పన్ను బ కాయిలు ఉంటే పోటీకి అర్హులు కారు. దీంతో తహసీల్దార్‌పై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దీంతో రెండు రోజుల నుంచి పాకలపాడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పన్నులు కట్టించుకోవడంలో కాలయాపన చేస్తున్నారు. బుధవారం సాయంత్రం నీటితీరువా పన్ను కట్టించుకోవాలని వచ్చిన రైతులపై తహసీల్దార్ మండి పడ్డారు.

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

తహసీల్దార్ తీరుపై రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను భంగం కలిగించేలా తహసీల్దార్ వ్యవహరించడం సరికాదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నీటి తీరువా కట్టించుకోనంటూ తహసీల్దార్ మాట్లాడటం దారుణమని పాకలపాడు రైతులు సబ్బవరపు సన్యాసినాయుడు, బొడ్డు ప్రసాద్, చింతంరెడ్డి అప్పలనాయుడుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు యాళ్ల నాయుడు, రాజాన అప్పలనాయుడు, ఇటంశెట్టి రాంబాబు తదితరులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గొలుగొండ సర్పంచ్ కసిపల్లి బుజ్జి పాల్గొన్నారు.

కలెక్టర్ల సదస్సులో విజయ కృష్ణన్



వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు, పథకాల అమలు గురించి వివరించారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

తుమ్మపాల: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు నోడల్ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.త్రినాథం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 14న సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 303 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2 లక్షల 75 వేల 266 మంది ఓటర్లు ఉన్నారు. మైనర్ ఇరిగేషన్‌లో 259 సంఘాల్లో లక్షా 77 వేల 326 మంది ఓటర్లు, మీడియం ఇరిగేషన్‌లో 28 సంఘాల్లో 66,195 మంది ఓటర్లు, మేజర్‌లో 16 సంఘాల్లో 31,775 మంది ఓటర్లు ఉన్నారు.

బెంగళూరు-హౌరా మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(08565) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 14వ తేదీన (శనివారం) ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.03 గంటలకు దువ్వాడకు, ఆదివారం రాత్రి 9.45 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జాలర్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్‌లలో ఆగుతుంది.

అన్నదాతకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట



ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

- ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం విఫలం
- జిల్లా కేంద్రం అనకాపల్లిలో రైతులతో భారీ ర్యాలీ రేపు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి వెల్లడి

చోడవరం: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్నదాతను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దుయ్యబట్టారు. అన్నదాతల పక్షాన నిలబడి, వారికి న్యాయం చేసే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం అనకాపల్లిలో శుక్రవారం రైతులతో భారీ ర్యాలీ నిర్వహించనునున్నామని తెలిపారు. ఈ మేరకు ర్యాలీకి సంబంధించిన ప్రచార వాల్ పోస్టర్లను చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం బూడి విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. ఖరీఫ్ వరి కోతల సమయంలో సంభవించిన తుపానుకు చాలా వరకు ధాన్యం తడిసిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తక్షణం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా స్థాయిలో అనకాపల్లిలో ఆందోళన చేయాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందన్నారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో

మిగతా 8వ పేజీలో ▶



పింఛన్ల సర్వేపై దుమారం

- పింఛన్లు తొలగిస్తారన్న భయం ఉందన్న జెడ్పీటీసీలు
- జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం

తలొగ్గిన టీడీపీ

- తొలుత ససేమిరా.. చివరకు కార్మికుల వేతన పెంపునకు ఆమోదం
- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

8లో



క్లుప్తంగా

ఫ్లోటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


బంగారు పతకంతో ప్రణతి ప్రశాంతి

నాతవరం: అనంతపురం జిల్లా నార్పల్ నేతాజీ హైస్కూల్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన 43వ జాతీయ స్థాయి ఫ్లోటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తాచాటి బంగారు పతకం సాధించింది. మొత్తం ఏడుగురు సభ్యుల గల ఈ జట్టుకు మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి ప్రణతిప్రశాంతి లీడర్‌గా వ్యవహరించారు. ప్రణతి ప్రశాంతితో పాటు చినగుమ్ములూరికి చెందిన యామిని, పి.స్వాతి కూడా ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో మొత్తం 15 జట్లు పాల్గొన్నాయని, మన రాష్ట్రజట్టు బంగారు పతకం సాధించిందని జిల్లా ఫ్లోటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పైల ప్రవీణ్ తెలిపారు. విజేతలకు ఈనెల 10న అనంతపురం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో బంగారు పతకం, సర్టిఫికెట్, షీల్డు అందజేశారు.

సత్యం మాస్టారు సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు, వేదికపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు

చీడికాడ: మాడుగుల నియోజకవర్గ అభివృద్ధిలో దివంగత మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ (సత్యం మాస్టారు) సేవలు అమూల్యమైనవని అసెంబ్లీ స్పీకర్ సీహెచ్.అయ్యన్న పాత్రుడు అన్నారు. ఇటీవల మృతి చెందిన సత్యనారాయణ సంస్మరణ సభ బుధవారం మండలంలోని పెదగోగాడలో జరిగింది. సత్యం మాస్టారు చిత్రపటం వద్ద అయ్యన్నతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బూడి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సత్యం మాస్టారు అందర్నీ కలుపుకొని పోయేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, గణబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

పింఛన్ల సర్వేపై దుమారం

- పింఛన్లు తొలగిస్తారన్న భయం ఉందన్న జెడ్పీటీసీలు
- ప్రొటోకాల్ పాటించడం లేదని సభ్యుల ఆవేదన


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ

మహారాణిపేట(విశాఖ): సామాజిక పింఛన్ల సర్వేపై జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో దుమారం చెలరేగింది. బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పింఛన్ల సర్వేపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని.. పింఛన్లు తొలగిస్తారన్న భయం నెలకొందని.. దీనిపై అపోహలు నివృత్తి చేయాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. దీనిపై జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర వివరణ కోరగా.. విశాఖ జిల్లా డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్లపై సర్వే జరుగుతోందన్నారు. పింఛన్లు తొలగించమని ఆదేశాలు లేవని, సర్వే నివేదిక కూడా ప్రభుత్వానికి పంపామన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

ప్రొటోకాల్‌పై కొంత మంది జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జెడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానాలు ఉండడం లేదని, శిలాఫలకాలపై పేర్లు వేయడం లేదని వాపోయారు. మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సామ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ మండలంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయని, తనను ఆహ్వానించలేదన్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించడం లేదని, అర్హత గల వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. కె.కోటపాడు మండలంలో ఇటీవల జరిగిన కార్యక్రమాలకు తమకు ఎలాంటి ఆహ్వానం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అన్నారు.

సదరం జాప్యంపై ఆందోళన

సదరం సర్టిఫికెట్లు అర్హులకు అందడం లేదని, స్లాట్‌ల కోసం దివ్యాంగులు పలుమార్లు తిరగాల్సి వస్తోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సదరం స్లాట్‌లు దొరకకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యులు ఈర్లె అనురాధ, పెంటకోట సామ సత్యనారాయణ అన్నారు. సదరం మెగా క్యాంప్ నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.

రాత్రులు వైద్యులు ఎక్కడ?

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రాత్రుల సమయంలో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఆస్పత్రుల్లో డ్యూటీ సమయంలో కూడా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, దీంతో రోగులను కేజీహెచ్‌కు తరలించాల్సి వస్తోందని కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు.

అందుబాటులో లేని 108 సేవలు

గతంలో ఫోన్ చేస్తే 108 వాహనాలు వచ్చేవని, ఇప్పుడు ఫోన్ చేసినా వచ్చే పరిస్థితి ఉండడం లేదని.. వాహనాలు ఏమైనా తగ్గించారా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. అనంతగిరిలో రోగులను 108 వాహనంలో ఎస్.కోటకు తరలిస్తున్నారని, దీని వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని జెడ్పీటీసీ గంగరాజు అన్నారు.

మరుగుదొడ్ల దుస్థితి దారుణం

జిల్లాలోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల దుస్థితి దారుణంగా ఉందని జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర, ఇతర సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పర్యటన సమయంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశీలించాలని ఆదేశించారు.

తీర్మానం

ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కార్యక్రమాలు, సమావేశాలకు స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఆహ్వానించాలని జిల్లా పరిషత్‌లో ఒక తీర్మానం చేయనున్నట్టు జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర తెలిపారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి కూడా పంపనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పే..ద్ద తోటకూర మొక్క


సాధారణంగా తోటకూర మొక్క పొడవు రెండు నుంచి మూడు అడుగుల వరకు ఉంటుంది. కానీ గొలుగొండలో సకిరెడ్డి నూకరాజు ఇంటి వద్ద 9 అడుగుల మేర తోటకూర మొక్క పెరిగి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. సేంద్రియ ఎరువు వినియోగం వల్లనే ఇంత ఏపుగా తోటకూర మొక్క పెరిగిందని నూకరాజు తెలిపారు.
- గొలుగొండ

జెడ్పీలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- యలమంచిలిలో జెడ్పీటీసీలకు అధికారులు సహకరించడం లేదు
- వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుల నిరసన


స్థాయీ సంఘం సమావేశంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు

మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించడం లేదని పలువురు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు, వివిధ పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధి పనుల కోసం జెడ్పీటీసీ సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలు అమలు చేయడం లేదని, దీంతో రూ.కోటి పనులు మురిగిపోయాయని తెలిపారు. బుధవారం జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. యలమంచిలి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని, అక్కడి జెడ్పీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ నిధుల వినియోగంలో స్థానిక జెడ్పీటీసీలకు సంబంధం లేదు అన్నట్టుగా కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది ఎక్కడ పద్ధతి అని, రాజ్యాంగంలో లేని పద్ధతులను జిల్లా పరిషత్‌లో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, కానీ పనులకు అడ్డుపడుతున్నారని తెలిపారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని జిల్లా పరిషత్‌లో అధికారులు అమలు చేస్తున్నారని మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సామ సత్యనారాయణ, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, మాకవరపాలెం జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి నియోజకవర్గంలో జెడ్పీటీసీలు చెప్పిన పనులు చేయడం లేదని, జిల్లా పరిషత్ పనుల్లో తమను పట్టించుకోవడం లేదని సేనాపతి సంధ్యారాణి తెలిపారు. అభివృద్ధి పనులకు కొంత మంది అధికారులు మోకాలడ్డుతున్నారని, స్థానిక ప్రజాప్రతినిధుల నిధులతో చేసే పనుల విషయంలో మా ప్రతిపాదనలు అమలు చేయడం లేదని మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సామ సత్యనారాయణ తెలిపారు.

వీకేఎంఎల్ స్టోర్‌లో చోరీ

నర్సీపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మెయిన్ రోడ్డులోని వి.కె.ఎం.ఎల్. స్టోర్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. స్టోర్ యజమాని గ్రంధి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. రూ.46 వేల నగదు, ఆయిల్ టిన్ చోరీకి గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

అన్నదాతకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట

▶7వ పేజీ తరువాయి

రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ఈ నెల 27న అనకాపల్లిలో జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించి నిరసన తెలపనున్నట్టు చెప్పారు. ఇప్పటికే రూ. 6 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన ప్రభుత్వం.. ఇప్పుడు మరో రూ. 9 వేల కోట్లు సర్ చార్జీల పేరుతో భారం వేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. హామీలు నెరవేర్చకుండా వైఎస్సార్ సీపీపై కూటమి ప్రభుత్వం నిందలు వేస్తుందని బూడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా వ్యవసాయ పెట్టుబడులకు రూ.20 వేలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఖరీఫ్ సీజన్ ముగిసినా ఆ డబ్బులు రైతులకు వేయలేదన్నారు. 2014–19 మధ్య టీడీపీ హయాంలో రాష్ట్రంలో 2.65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. 2019–23 వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 3.40 లక్షల టన్నుల ధాన్యాం కొనుగోలు చేశామన్నారు.

ప్రజలకు మేలు లేదు.. తప్పుడు ప్రచారాలకే ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ తప్పుడు ప్రచారాలు చేయడానికే కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారే తప్పా, ప్రజలకు మేలు చేసే పనులేవీ చేపట్టడం లేదని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయని ప్రజలు ఓట్లు వేస్తే.. తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందక విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అప్పులు చేసి ఫీజులు కడుతున్నారన్నారు. ఎంత మంది పిల్లలు చదుకుంటే అంత మందికి తల్లికి వందనం పేరిట రూ.15వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధర్మశ్రీ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన నవరత్నాలతో పాటు ప్రజలకు అవసరాలను గుర్తించి అనేక పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. రైతులు, ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ సభ్యులు మారిశెట్టి విజయశ్రీకాంత్, దొండా రాంబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

తుమ్మపాల: బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి, ఏడాదిన్నర అనుభవం కలిగిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలోని పునరావాస కేంద్రంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓమ్‌కాప్, అల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 18న ప్రీ అసెస్మెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు మాత్రమే అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500, జీఎస్‌టీతో కలిపి చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రాను పోను విమాన టిక్కెట్లు అభ్యర్థి కట్టిన రిజిస్ట్రేషన్ ఫీజు నుంచే చెల్లిస్తారని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు జీతం భారత కరెన్సీలో సుమారు రూ.78 వేల నుంచి రూ.89 వేల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, జననం ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్, కోవిడ్, ఎంఎంఆర్ సర్టి ఫికెట్ సమర్పించాలన్నారు. నర్సింగ్ పరిజ్ఞానం, ప్రాథమిక ఇంగ్లిష్, డిజిటల్ నైపుణ్యాలలో ప్రాథమిక పరీక్షలు అర్హత పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్మికుల వేతనాల పెంపుపై తలొగ్గిన టీడీపీ

- 67 అంశాలపై విస్తృతంగా చర్చ
- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

టీడీపీ సభ్యులకు కౌంటర్ ఇస్తున్న జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్





డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ తలొగ్గింది. వైఎస్సార్ సీపీ, వామపక్ష పార్టీలతో పాటు జనసేన, బీజేపీ సభ్యులు కార్మికుల వేతనాల పెంపు అంశంపై ఆమోదం తెలపడంతో.. చివరకు టీడీపీ సభ్యులు తలొగ్గి ఆ అంశాన్ని ఆమోదించారు. అంత వరకు ఆ అంశాన్ని వాయిదా వేయండని ఒకరు.. అధికారులే నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకని మరొకరు.. ఈ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసి చర్చించిన తర్వాత ప్రభుత్వానికి పంపాలని ఇంకొకరు.. ఇలా టీడీపీ సభ్యులు ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందించారు.

జీవీఎంసీ సర్వసభ్య సమావేశం బుధవారం కౌన్సిల్ హాలులో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. 46 అజెండా, 21 సప్లిమెంటరీ అంశాలు సభ్యుల చర్చకు వచ్చాయి. వీటిలో 60 అంశాలను సభ్యులు ఆమోదించగా.. 2 వాయిదా వేశారు. మూడు రద్దు చేసి, రెండు తిరస్కరించారు. నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని డిప్యూటీ మేయర్ కె.సతీష్ అన్నారు. ప్రొటోకాల్ పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మేయర్ ఆదేశించారు.

కార్మికుల వేతన పెంపుపై విస్తృత చర్చ

నీటి సరఫరా విభాగం కార్మికులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, టర్న్‌కాక్స్, బోర్ మెకానిక్స్, ఫిట్టర్/ఎలక్ట్రికల్ హెల్పర్లకు అర్హత, అనుభవం, కేటగిరీ ఆధారంగా వేతనాలు పెంచాలని కొంతకాలంగా యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీవో 7 ప్రకారం స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్గీకరణ ఆధారంగా వేతనాలు చెల్లించాలనే ప్రతిపాదనపై దాదాపు గంట పాటు జరిగింది. ఈ అంశంపై కొందరు టీడీపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ 2019–23 వరకు ఎంత మందిని తీసుకున్నారు? ఎలా నియమించారు? దీనిపై ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అధికారులే నిర్ణయాలు తీసుకుని నేరుగా నియమించుకుంటున్నారని.. అలాంటప్పుడు గౌరవ సభ్యులుగా తామెందుకని మరికొందరు ఎస్ఈని ప్రశ్నించారు. ఈ అంశంపై విస్తృత చర్చ అనంతరం టీడీపీ తప్ప అన్ని పార్టీలు ఆమోదం తెలిపాయి. చివరకు చేసేదేమీ లేక టీడీపీ కార్పొరేటర్లు ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ అంశాన్ని ఆమోదిస్తున్నామని.. సభ్యులు లేవనెత్తిన 169 మంది కార్మికులకు సంబంధించి పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

త్వరలో నోటిఫికేషన్

- జీవీఎంసీ లీగల్ విభాగానికి సంబంధించి 8 జోన్లలో పనిచేస్తున్న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పదవీకాలం కొనసాగించే విషయమై వచ్చిన అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ సభ్యుల సూచన మేరకు ఈ అంశాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. నూతన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల నియామకానికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు.
- ముడసర్లోవ పార్కులో గుర్రపు స్వారీ బరిని అభివృద్ధి పరిచి ఏడేళ్లు నిర్వహించేందుకు వచ్చిన అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. గుర్రాల పార్కు అవసరం లేదని, ఈ స్థలాన్ని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని సభ్యులు సూచించారు. ఇప్పటి వరకు కాంట్రాక్టరకు ఇచ్చిన మొత్తాన్ని రికవరీ చేయాలన్నారు.

వాయిదా వేసిన అంశాలివీ

- జీవీఎంసీకి చెందిన వివిధ క్రీడా ప్రాంగణాల్లో సభ్యత్వ రుసుంలు, అద్దెలు, ఇతర రుసుంలు సవరించే ప్రతిపాదన అంశాన్ని సభ్యులు వాయిదా వేశారు. జీవీఎంసీకి చెందిన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, బీచ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని లాన్ టెన్నిస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, ఎంవీపీ కాలనీలోని రాజీవ్ ఇండోర్ జిమ్నాజియం, గాజువాకలోని రాజీవ్ క్రీడా ప్రాంగణం, శ్రీరాజ రాజేశ్వరి కళా క్షేత్రం, మల్కాపురం క్రీడా ప్రాంగణం, అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, భీమునిపట్నంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం, మున్సిపల్ గ్రౌండ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వకుండా.. జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నడిచేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. ఈ అంశంపై పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు. దీంతో మేయర్ ఈ అంశాన్ని వాయిదా వేశారు.
- జోన్–1 పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకట్రావు స్వచ్ఛంద పదవీ విరమణకు చేసుకున్న దరఖాస్తుపై సభ్యులు స్పందించారు. ఈ అంశాన్ని స్థాయీ సంఘ సభ్యులు రెండు సార్లు వాయిదా వేశారని, అతనిపై వస్తున్న ఆరోపణలపై చర్చించాలని పలువురు సభ్యులు కోరారు. దీంతో మేయర్ ఈ అంశాన్ని వాయిదా వేశారు.

టీడీఆర్‌ల జారీపై రభస

2014 నుంచి 2024 వరకు జారీ చేసిన టీడీఆర్‌లపై సమగ్రంగా విచారించి చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఇప్పటి వరకు వందల కోట్ల విలువ చేసిన 1035 టీడీఆర్‌లు ఏ ప్రాతిపదికన జారీ చేశారో తెలపాలని, వీటిలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఏ టీడీఆర్‌పై అనుమానం ఉందో తెలిపితే వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

నేటి నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

15 వరకు ఏయూ మైదానంలో నిర్వహణ


ఆర్గానిక్ మేళా ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో గురువారం నుంచి ఆదివారం(15వ తేదీ) వరకు విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహించనున్నట్లు శాసన మండలి పూర్వ సభ్యులు పీవీఎస్ మాధవ్ తెలిపారు. సాగరతీరంలోని ఆర్కే బీచ్‌లో ఆర్గానిక్ మేళాపై ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ రైతు సాధికార సంస్థ నేతృత్వంలో జరిగే ఈ ఆర్గానిక్ మేళాను నగరవాసులు ఆదరించాలని కోరారు. 50 మంది రైతులు, ఆదివాసీలు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ మాట్లాడుతూ ఈ మేళాలో 12న రైతుల సమ్మేళనం, 13న మీ ఆరోగ్యం మీ చేతిలో, 14న ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటల పెంపకం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాలెం నేచురల్స్ అశోక్, సత్వ నేచురల్స్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంఎస్ఎంఈల సర్వే 11.7 శాతం పూర్తి

తుమ్మపాల: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల సర్వే జిల్లాలో 11.7 శాతం పూర్తి చేసినట్టు ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి.నాగరాజ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేను గత నెల 29న ప్రారంభించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని రంగాల్లోను 58,717 ఎంఎస్ఎంఈలను గుర్తించినట్టు తెలిపారు. ఇప్పటికి 5,002 ఎంఎస్ఎంఈల్లో సర్వే జరిపినట్టు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నాటికి సర్వే పూర్తి చేయడం జరుగుతుందని, జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, సర్వీసింగ్, వ్యాపార యూనిట్ల సంస్థలు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు వరాహ లక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధిలో కొలువై ఉన్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి గురువారం ఉదయం స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు


పోలీస్ సిబ్బందికి రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: మానసిక ఒత్తిడికి గురికాకుండా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలని, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో డివిజన్ పరిధిలో పోలీస్ సిబ్బందికోసం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఏడాదికి రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అనారోగ్యం వస్తే వైద్యులు సూచనల మేరకు సకాలంలో మందులువాడాలని ఆమె సూచించారు. అంతకుముందు వైద్యాలయ వైద్య సిబ్బంది పోలీసులకు బీపీ, సుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.అప్పారావు, సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణ, టి.లక్ష్మి, ఎస్ఐ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 2,783 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	5,010
మొదటి రకం	3,510	4.200
రెండో రకం	3,140	3,780
మూడోరకం	3,040	3,180

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరన్	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
దేవర	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-6 యూనిట్లు, బి పాజిటివ్-8 యూనిట్లు, ఒ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 336 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924-223595)ని సంప్రదించవచ్చు.

కన్నీరు పాలెం

అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి ఇది... నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ మార్గంలో కన్నూరుపాలెం కూడలి వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ రోడ్డులో నిత్యం దుమ్ముధూళి దట్టంగా ఎగసిపడుతుండడంతో కన్నూరుపాలెంతో పాటు ఐదు గ్రామాల్లో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ధూళి కారణంగా కళ్ల మంటలతో పాటు కంటి నుంచి నీరుకారడం, శ్వాసకోశ వ్యాధులు, ఇతర సమస్యలు ఏర్పడుతున్నాయి. వ్యాపారాలు సరిగా జరగక దుకాణదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.


కన్నూరుపాలెం రోడ్డులో రేగుతున్న ధూళి

- కన్నూరుపాలెం కూడలిలో ఎగసిపడుతున్న దుమ్ముధూళి
- కళ్లమంటలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు, ప్రయాణికులు
- రోడ్డుపై పెద్ద పెద్ద గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు
- నరకయాతన అనుభవిస్తున్న ఐదు గ్రామాల ప్రజలు
- నిధులు మంజూరైనా మరమ్మతులు చేపట్టని అధికారులు

కశింకోట: అనకాపల్లి-నర్సీపట్నం మార్గంలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన ప్రధాన రోడ్డులో కన్నూరుపాలెం గ్రామం ఉంది. సుమారు 3 వేల మంది నివసిస్తున్నారు.కన్నూరుపాలెంతోపాటు చుట్టుపక్కల ఉన్న తీడ, చెరకాం, పాత కన్నూరుపాలెం, తోటకూరపాలెం తదితర గ్రామాలకు ఇది కూడలి. ఆయా గ్రామాల ప్రజలు ఏ చిన్నపని కావాలన్నా నిత్యం కన్నూరుపాలెం కూడలికి వెళ్లాలి. ఇది ప్రధాన రహదారి కావడంతో వందలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. మాకవరపాలెం వద్ద ఆన్‌రాక్‌కు పరిశ్రమకు భారీ టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలతో పాటు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో రాత్రీపగలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు కొందరు గోతుల్లో క్రషర్ మెటల్, క్రషర్ బుగ్గి వేసి, తాత్కాలికంగా పూడుస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా మళ్లీ గోతులు ఏర్పడుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున దుమ్ముధూళి ఎగిరిపడుతున్నాయి.

కన్నూరుపాలెంతోపాటు పలుచోట్ల రోడ్డు మరమ్మతులకు రోడ్లు, భవనాల శాఖ ద్వారా ఇటీవల అత్యవసర ప్రాతిపదికన ప్రభుత్వం రూ.పది లక్షలు మంజూరు చేసింది. భూమి పూజ కూడా చేసినప్పటికీ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోం

తరచూ ప్రమాదాలు

ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరవడంతో కొద్దిపాటి వర్షం పడినా గోతుల్లో నీరు చేరుతోంది. ద్విచక్రవాహన దారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం వాహనచోదకులకు నరక ప్రాయంగా మారింది.


కన్నూరుపాలెం వద్ద భారీ వాహనం

మాస్కులు ధరించినా..

దుమ్ముధూళిని భరిస్తూ బస్సుల కోసం ప్రయాణికులు షెల్టర్‌లో వేచి ఉండవలసి వస్తోంది. దీంతో వారి దుస్తులు దుమ్ముకొట్టుకుపోతున్నాయి. మాసిపోయినట్టు ఉన్న దుస్తులతోనే గమ్యస్థానాలకు చేరవలసి వస్తోందని, దుమ్ము నుంచి రక్షణ పొందేందుకు మాస్కులు ధరించినా ప్రయోజనం లేకపోతోందని స్థానికులు వాపోతున్నారు.


మాస్క్ ధరించి బస్సుకోసం నిరీక్షిస్తున్న మహిళ

దని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఇంకా ఎంత కాలం దుమ్ము, ధూళి భరించాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరమే కూడలిలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టి దుమ్ము, ధూళి సమస్య నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.


ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా ?

శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి



కన్నూరుపాలెం కూడలిలో రోడ్డు గోతులతో నిండిపోవడం వల్ల వాహనాల రాకపోకల తాకిడికి దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున ఎగసి పడుతోంది. బస్ స్టాప్‌లో బస్సు కోసం నిరీక్షించడం ఇబ్బందిగా పరిణమించింది. దుస్తులు పాడవుతున్నాయి. శ్వాస కోశ వ్యాధులకు గురి కావలసి వస్తోంది. సత్వరమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య నుంచి గట్టెక్కించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కూండ్రపు నరసింహమూర్తి, కన్నూరుపాలెం.

ప్లాస్టిక్ పరదాల మాటున వ్యాపారం

ఈ కూడలిలో సుమారు 20 దుకాణాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున దమ్ము ఎగసిపడుతుండడంతో ఇళ్లతోపాటు, దుకాణాల్లో మట్టి చేరుతోంది. ఎంతగా శుభ్రం చేసుకుంటున్నా ప్రతి ఇంటి పైకప్పు, దుకాణాలు ప్రతి రోజు ఎర్ర మట్టితో నిండిపోతున్నాయి. దీంతో దుమ్ము నుంచి రక్షణ పొందేందుకు దుకాణాల వద్ద ప్లాస్టిక్ పరదాలను ఏర్పాటు చేసుకున్నారు. దుమ్ము కారణంగా వ్యాపారాలు సరిగా జరగడం లేదని దుకాణదారులు వాపోతున్నారు.


షాపు వద్ద కట్టిన ప్లాస్టిక్ పరదా

త్వరలో పనులు చేపడతాం

కన్నూరుపాలెం నుంచి జి.భీమవరం వంతెన వరకు అత్యవసర నిధుల కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. వీటితో కన్నూరుపాలెంతోపాటు ఇతర చోట్ల దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తాం. త్వరలోనే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-సత్యవాణి, ఏఈ, రోడ్లు, భవనాల శాఖ, యలమంచిలి.

అరకొరగా వ్యాపారం



కన్నూరుపాలెం కూడలిలో వాహనాల తాకిడికి ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి వల్ల దుకాణంలో వ్యాపార కార్యకలాపాలు సాగించుకోలేకపోతున్నాం. ప్లాస్టిక్ పరదాల మాటున అతి కష్టం మీద వ్యాపారం చేయాల్సి వస్తోంది. దీనివల్ల నష్టం ఏర్పడుతుంది. చాలా కాలంగా ఈ సమస్య ఉంది. మరమ్మతులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- బొడ్డి సన్యాసిశెట్టి, వ్యాపారి, కన్నూరుపాలెం.

కాలినడకన విజయవాడ వెళ్తున్న భవానీ భక్తులకు ఆతిథ్యం


నరసింగబిల్లి చేరిన భవానీ భక్త బృందం

కశింకోట: శ్రీకాకుళం జిల్లాకు చెందిన పది మంది భవానీ భక్తులు విజయవాడకు చేపట్టిన పాదయాత్ర బుధవారం మండలంలోని నరసింగబిల్లి గ్రామానికి చేరింది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం రావివలస గ్రామానికి చెందిన సురేష్, రాము, నాగరాజు, శ్యాం, దిలీప్, నాగరాజు, కార్తీక్, రాంబాబు, కోమలిరావు, సాయి లతో కూడిన పది మంది బృందం ఈ నెల 5న గ్రామం నుంచి బయలుదేరింది. ఇక్కడకు చేరిన బృందానికి గురుస్వామి జెర్రిపోతుల నూకినాయుడు ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చారు. తాము పదేళ్లగా భవానీ మాల ధరించి ఏటా పాద యాత్రగా విజయవాడ చేరుకుని కనకదుర్గ అమ్మవారిని దర్శిస్తున్నామని బృందం ప్రతినిధి సురేష్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు గొంతిన సూరేష్, మేరపురెడ్డి గిరిబాబు, యర్ర జ్యోతికుమార్, వీరునాయుడు, సురేష్, చిట్టిబాబు, నాగేష్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో బ్యాంకింగ్ సేవలు

కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు

అనకాపల్లి: ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు తెలిపారు. స్థానిక గవరపాలెం మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 10వ శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు బ్యాంకింగ్ రంగంపై, ఆర్థిక విధానాలపై అవగాహన, ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించేందుకు 'యువ డిపాజిట్' పేరిట కొత్త పథకాన్ని ప్రారంభించినట్టు చెప్పారు.ఈ పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్‌కి ఇచ్చే ప్రాధాన్యత, అధిక వడ్డీ యువ డిపాజిట్ దారులకు కూడా వర్తిస్తుందన్నారు. 25 సంవత్సరాలుగా సహకార రంగంలో ఉన్న మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలని నూతన గృహాలు నిర్మించుకునేందకు, చిన్నవ్యాపారులకు, కుటుంబ అవసరాలకు, విద్యార్థుల ఉన్నత చదువులకు, తక్కువ వడ్డీతో త్వరితగతిన బంగారు ఆభరణాలపై రుణాలు పొందవచ్చని ఆయన చెప్పారు. లాకర్, మొబైల్ బ్యాంక్, డెబిట్ కార్డు సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్, జి.ఎస్.ఎన్.రాజు, పైడా విద్యాసంస్థలు చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, అనకాల్లి బెల్లం వ్యాపారి ఇమిడిశెట్టి రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తగరంపూడికి జాతీయ అవార్డుపై హర్షం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. దీంతో 2023-24 సంవత్సరానికి మండలంలో తగరంపూడి పంచాయతీకి పచ్చదనం-పరిశుభ్రతపై జాతీయ స్థాయిలో అవార్డు లభించిందని, పురస్కారం రావడం హర్షణీయమని చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయాలు, వర్మీంకపోస్టుయార్డులు, రహదారులు, తాగునీరు, పరిశుభ్రం, పచ్చదనంపై గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. మండలంలో మిలిగిన గ్రామాలు కూడా రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో అవార్డులు పొందేలా స్థానిక ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అజోల్లా పెంపకంతో మెరుగైన ఫలితాలు


మాట్లాడుతున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: రైతులు అజోల్లా పెంచడం ద్వారా పశువులకు దాణాతో పాటు మెరుగైన ఆదాయం ఆర్జించవచ్చని మండల పశు వైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని నాగవరంలో బుధవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధిగా ప్రతి పశువుకు నాలుగు నెలలకొకసారి పాముల మందు వేయాలన్నారు. స్థానికంగా అజోల్లాను పెంపకంపై దృష్టి సారించాలన్నారు. దీని వల్ల దాణా ఖర్చు తగ్గడంతో పాటు పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 1800- 4198800 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు


బట్లపూడి ఏలేరు కాల్వ గట్టుపై నిర్మాణాలు

తుమ్మపాల: ఏలేరు కాలువ గట్టుపై అక్రమ నిర్మాణాల తొలగించాలని కోరుతూ మండలంలో బట్లపూడి గ్రామం రాయుడుపేటకు చెందిన దొడ్డి వరలక్ష్మి, కాలనీ వాసులు బుధవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 4లోని ప్రభుత్వ భూమిలో (ఏలేరు కాలువ గట్టుపై) గ్రామానికి చెందిన ఇల్ల ఆదినారాయణ, ఇల్ల వరలక్ష్మి అధికార పార్టీ అండతో దుకాణం, భవనాన్ని నిర్మించారని, తహసీల్దార్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని పేర్కొన్నారు. తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

రెండో గురువారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసి ఉన్న కనకమహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో మార్గశిర మాసం రెండవ గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లు, మిగతా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

మునగపాక: మూలపేటలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ గంగప్పలనాయుడు భూమి పూజ చేశారు. స్థానిక నాయకులు దొడ్డి శ్రీనివాస రావు, టిక్కలి పరశురామ్, ఆడారి జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తి భావాలు పెంపు అభినందనీయం


ఆధ్యాత్మిక ప్రచారకర్త నూకరాజు దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్నాథరావు

మునగపాక: ప్రజల్లో భక్తి భావాలు పెంపొందించడంలో ఆధ్యాత్మిక ప్రచారకర్త తేలు నూకరాజు సేవలు అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట జగన్నాథరావు కొనియాడారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో కార్తీక మాసంలో నెలరోజుల పాటు ప్రజల్లో భక్తి భావాల పెంపుపై చేపట్టిన అవగాహన కార్యక్రమం బుధవారం ముగిసింది. అనంతరం గీతా జయంతి సందర్భంగా పలువురు నూకరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మారిశెట్టి అప్పారావు, వేగి లక్ష్మణరావు, కాండ్రేగుల పరదేశిరావు, ఆడారి సన్యాసిరావు, కాండ్రేగుల సంధ్య, వేగి వీరునాయుడు, మావూరి కాశీబు, పెంటకోట చిన్న, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చేట్టాలని వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్

తుమ్మపాల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమోదం పొంది, వెరిఫికేషన్ ప్రక్రియలో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించి తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. మంచి నీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేసే వర్కర్లకు పనికి తగిన వేతనం చెల్లించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: జీవీఎంసీలో తాగునీటి విభాగంతో పాటు, పలు విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల జీతాలను పెంచాలని వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కోరారు. విశాఖ జీవీఎంసీ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని ఆమె కోరారు. ఈ విషయంపై జీవీఎంసీ కమిషనర్, మేయర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

అన్నదాతల్లో మళ్లీ కలవరం


యండపల్లిలో వరి కుప్ప వేస్తున్న రైతులు

కోటవురట్ల: చి'వరి'దశలో పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే తుపాను కారణంగా వరి కోతలు ఆలస్యం కాగా.. గింజ రాలిపోతుండడంతో గత రెండు రోజులుగా రైతులు పనులు మొదలెట్టారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. జోరుగా కోతలు కోస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోసారి తుపాను హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అన్నదాతల్లో మళ్లీ కలవరం మొదలైంది. ఇంకా ఆలస్యమైతే తీవ్ర నష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాంతో కొందరు రైతులు దేవుడిపై భారం మోపి కోతలు చేపడుతున్నారు. మరికొందరు రైతులు వెనువెంటనే కుప్పలు వేసి పంటను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఎక్కడ చూసినా ఓ పక్క కోతలు, వరి కుప్పలు వేస్తూ రైతులు బిజీగా ఉన్నారు. జల్లూరు, యండపల్లి, అన్నవరం, తంగేడు, బి.కె.పల్లి, కోటవురట్ల, లింగాపురం, రాజుపేట, గొట్టివాడ, చౌడువాడ, రామచంద్రపురం, పందూరు, కె.వెంకటాపురం, పాములవాక తదితర గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.